క్లుప్తంగా

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



గుడివాడరూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల, గ్రామస్థాయి అధికారులతో సంక్రాంతి సందర్భంగా మండలంలో జూదాలను అరికట్టేందుకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జూదాలను అడ్డుకునేందుకు మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మండల పశు వైద్యాధికారి హనుమంతరావు, డెప్యూటీ తహసీల్దార్ రామశివ, పీడీఎస్ డీటీ కిరణ్, ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలే ముద్దు



కైకలూరు: సంక్రాంతి పండగ సమయంలో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో పలు మండలాల్లో ఆయా స్టేషన్ల ఎస్ఐల ఆధ్వర్యంలో జూదాలు వద్దు–సంప్రదాయ క్రీడలే ముద్దు అనే నినాదంతో అవగాహన సదస్సులు సోమవారం నిర్వహించారు. కలిదిండి సచివాలయం వద్ద ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, కైకలూరు రూరల్ మండలం నత్తగుళ్లపాడులో ఎస్ఐ వి.రాంబాబు, మండవల్లి మండలం పులపర్రులో ఎస్ఐ రామచంద్రరావు ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిహారం అక్రమాలపై విచారణ చేపట్టాలని వినతి

తోట్లవల్లూరు: మండలంలో కృష్ణానది వరదల సందర్భంగా చోటు చేసుకున్న పంటనష్ట పరిహారం పంపిణీలో అక్రమాలపై విచారణ జరిపించాలని కలెక్టర్ డీకే బాలాజీకి విజ్ఞప్తి చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఈ విషయమై వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరిహారం పంపిణీలో అక్రమాలకు పాల్పడిన మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఉద్యానశాఖాధికారి చందు జోసఫ్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని, జాయింట్ కలెక్టర్‌తో విచారణ జరిపించాలని కోరినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

నేడు మండల సమావేశం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవికాంత్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

గ్రామ సభలో తీర్మానాలకు విలువ ఇవ్వాలి



మండవల్లి: గ్రామ సభలో తీర్మానాలకు పంచాయతీ విలువ ఇస్తే ప్రజలకు విశ్వాసం ఏర్పడుతుందని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు.
మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం గ్రామసభ నిర్వహించారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇచ్చిన కుళాయిలకు తాగునీరు ఎప్పుడు అందిస్తారని పలువురు ప్రశ్నించారు. 300 మందికి కుళాయిలు అవసరం కాగా కేవలం 70 కుళాయిలకే నిధులు మంజూరయ్యాయని కార్యదర్శి ఎం.సాయిప్రదీప్ తెలిపారు. ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, ఏపీఓ ఎస్.నవీన్, మెడికల్ ఆఫీసర్ ఎస్.పవిత్ర, పశు సంవర్ధక శాఖ ఏడీ డీవీ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



ముదినేపల్లి రూరల్: ఏపీటీఎఫ్ నూతన సంవత్సర డైరీని ఎంఈఓ–2 సేవ్యా నాయక్ సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో సంఘ నాయకులు బేతాల రాజేంద్ర ప్రసాద్, కృపాకర్, వెంకటరత్నం, రెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంఈఓ డైరీ ఆవిష్కరించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసేద్దాం..!

- విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభతరం
- యాప్ వినియోగం రాని వారికి క్యూఆర్ కోడ్
- అవగాహన పెంచుతున్న విద్యుత్‌శాఖ
- ప్రతి విద్యుత్ బిల్లుపై క్యూఆర్ కోడ్ ముద్రణ



కైకలూరుకు విద్యుత్ సరఫరా చేసే లోకుమూడి విద్యుత్ కేంద్రం

కైకలూరు: సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకూ కొత్త ఆవిష్కరణలకు ఆద్యం పోస్తోంది. హోటల్లో టీ తాగినా ఫోన్‌పేలో చెల్లింపులు చేస్తున్నాం. అంతా డిజిటల్ యుగంగా మారింది. ఇటువంటి తరుణంలో నెలవారీ విద్యుత్ బిల్లుల చెల్లింపు పెద్ద ప్రహసనంలా మారింది. థర్డ్ పార్టీ యాప్‌లైన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంల ద్వారా విద్యుత్ చెల్లింపులు నిలుపుదల చేస్తూ గత ఏడాది జూలై ఒకటిన ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. తర్వాత ఏపీసీపీడీసీఎల్ చెల్లింపులకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చింది. వినియోగదారులకు యాప్ ద్వారా చెల్లింపు కష్టతరం కావడంతో ఇప్పుడు బిల్లుతోనే క్యూ ఆర్ కోడ్‌ను ముద్రించి పంపిణీ చేస్తున్నారు.



డిజిటల్ చెల్లింపులు సింబాలిక్

క్యూఆర్ కోడ్ కలిగిన విద్యుత్ బిల్లు

అందుబాటులోకి క్యూఆర్ కోడ్

వినియోగదారులు మీ–సేవా కేంద్రాలు, ప్రత్యేక సర్వీస్ ప్రొవైడర్లు, విద్యుత్ కేంద్రాల్లో ఉన్న కలెక్షన్ సెంటర్లు, గ్రామాల్లోకి వచ్చే ప్రత్యేక బిల్లు కలెక్టర్ల ద్వారా బిల్లులు చెల్లిస్తున్నారు. తర్వాత యూపీఐ సర్వీసులైన ఫోన్‌పే వంటి వాటి ద్వారా చెల్లించేవారు. ఈ పద్ధతిలో చెల్లిస్తున్నా బిల్లులు మొత్తం సకాలంలో విద్యుత్ సంస్థలకు అందడం లేదనే నెపంతో ఫోన్‌పే ద్వారా చెల్లింపులను నిలుపుదల చేశారు. అనంతరం సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఏపీ లిమిటెడ్ ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. యాప్ ద్వారానే బిల్లులు చెల్లించాలని విద్యుత్ సంస్థలు ప్రకటించాయి. ఈ యాప్‌పై అనేక మందికి అవగాహన లేకపోవడంతో బిల్లుల చెల్లింపులకు వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. దీనిని గమనించిన ఏపీసీపీడీసీఎల్ మూడు నెలల నుంచి క్యూఆర్ కోడ్ వ్యవస్థను తీసుకొచ్చింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే బిల్లు మొత్తం వస్తుంది. దీనిని ప్రోసెస్ చేసి బ్యాంకు ఖాతాకు సీక్రెట్ కోడ్ నమోదు చేస్తే బిల్లులు చెల్లింపు అవుతుంది.



కైకలూరు నియోజవవర్గంలో విద్యుత్ సర్వీసులు ఇలా..		
విద్యుత్ సెక్షన్లు	సర్వీసులు	నెలవారి డిమాండ్
కైకలూరు టౌన్	17,795	రూ.2,57,28,250
కైకలూరు రూరల్	12,811	రూ.2,70,87,296
కలిదిండి	28,577	రూ.4,99,09,751
మండవల్లి	8,812	రూ.3,96,98,180
ముదినేపల్లి	23,716	రూ.3,69,32,518

విద్యుత్ వినియోగంలో కైకలూరు టాప్

కైకలూరు నియోజకవర్గంలో ఆక్వా పరిశ్రమ విస్తరించి ఉండటంతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. నియోజకవర్గం మొత్తం మీద 1,01,711 విద్యుత్ కనెక్షన్లకుగానూ ప్రతి నెలా రూ.17,93,55,995 బిల్లుల రూపంలో విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నారు. ఇదిలా ఉంటే యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ ద్వారా బిల్లు చెల్లిస్తే ఒక కనెక్షన్‌కు రూ.2.50 కమీషన్ ప్రొవైడర్లకు దక్కేది. మిగిలిన మొత్తం సంస్థకు చేరేది. దీనిలో జాప్యం కారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అభ్యంతరం పెట్టడంతో యూపీఐ సర్వీసులను నిలుపుదల చేశారు. ప్రస్తుత క్యూఆర్ కోడ్‌పై గ్రామాల్లో మరింత ప్రచారం చేయాల్సి ఉంది.



క్యూఆర్ కోడ్ పద్ధతి సులభం

విద్యుత్ బిల్లులపై ఇటీవల క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నారు. దీని వలన నేరుగా యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపు చేస్తున్నాం. ఈ పద్ధతి సులభంగా ఉంది. విద్యుత్ యాప్ గురించి అనేక మందికి అవగాహన లేకపోవడంతో సరైన సమయంలో చెల్లించలేకపోయారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– ఎండీ గాలిబ్‌బాబు, న్యాయవాది, కైకలూరు



ఆన్‌లైన్ పేమెంట్ల సంఖ్య పెరుగుతోంది

విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం బిల్లుల చెల్లింపులతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీసీపీడీసీఎల్ రూపొందిస్తోంది. బిల్లుల కింది భాగాన క్యూఆర్ కోడ్‌ను ముద్రించి ఇస్తున్నాం. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా స్కాన్ చేసి బిల్లు చెల్లించే అవకాశం వచ్చింది. క్యూఆర్ కోడ్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. దీని వలన ఆన్‌లైన్ పేమెంట్ల సంఖ్య పెరిగింది.

– జీబీ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, గుడివాడ

పాడి రైతుకు నష్ట పరిహారం ఇప్పించాలని వినతి



గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం ఒకటో వార్డులో ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి రెండు పాడి గేదెలు విద్యుత్ షాక్‌కు గత గురువారం బలై మృత్యువాత పడ్డాయని యునైటెడ్ ఫోరం ఫర్ యూఎఫ్ ఆర్‌టీఐ రాష్ట్ర కో–కన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ విషయమై ఆయన సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో బాధిత పాడి రైతు పామర్తి నరసింహారావు తరపున జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి వినతిని అందించారు. బాధిత రైతుకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. ఆ వినతిని జిల్లా విద్యుత్ శాఖ అధికారులకు అందించి వెంటనే పరిష్కారం చేయాలని కలెక్టర్ ఆదేశించారని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

శ్మశానానికి వెళ్లే రోడ్డు నిర్మాణం చేపట్టాలి



కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు గ్రామ పంచాయతీ పరిధిలో భీమానది చానల్ వంతెన నుంచి శ్మశానానికి వెళ్లే రహదారి వెంటనే అభివృద్ధి చేయలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు రోడ్డును వెంటనే నిర్మించి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కోసూరు పంచాయతీ సచివాలయ కార్యదర్శి ఎంఎస్ఎన్ మూర్తికి గ్రామస్తుల సంతకాలతో కూడిన అర్జీని అందజేశారు. పెనుమాక కామేశ్వరరావు, శ్రీనివాసరావు, విజయభాస్కర్, వీరయ్య, ఎస్.శివ, కొండలు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు భారీ ఏర్పాట్లు

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో జరగనున్న సంక్రాంతి సంబరాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్ అన్నారు. సోమవారం స్టేడియం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. గ్రామీణ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు, గంగిరెడ్ల ప్రదర్శన, వంటల పోటీలు, కర్రసాము తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, రంగప్రసాద్

సంప్రదాయ క్రీడల ఏర్పాటు అభినందనీయం

కైకలూరు: సంక్రాంతి పండగ సమయంలో యువత కోడి పందేలు, పేకాట, జూదాలకు ఆకర్షితులవకుండా పోలీసుశాఖ సంప్రదాయ క్రీడలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. ఆటపాక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కైకలూరు పోలీసు ప్రీమియం లీగ్–2025 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను జయమంగళ, కమ్మిలి సోమవారం ప్రారంభించారు. అనంతరం పట్టణ, కైకలూరు రూరల్ సర్కిల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో యువత జూదాల వైపు వెళ్లకుండా గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ వంటి క్రీడలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీలత, ఎస్ఐలు డి.వెంకట్‌కుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

45 జట్లు పేర్ల నమోదు

టోర్నమెంట్‌కు సంబంధించి ఇప్పటి వరకు నియోజకవర్గం నుంచి 45 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయి. మొదటి రోజు కైకలూరుకు చెందిన హారిపోర్టర్స్ విక్టర్స్–రాచపట్నం జట్ల మధ్య పోటీ నిర్వహించగా మొదటి బ్యాటింగ్ చేసిన హారిపోర్టర్స్ 10 ఓవర్లకుగానూ 9 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. రాచపట్నం జట్టు 7 ఓవర్లకు 54 పరుగులు తీసి ఆలౌట్ అయింది. తర్వాత కలిదిండి లెవెన్స్–కైకలూరు కౌశిక్ వారియర్స్ మధ్య పోటీలో కలిదిండి 10 ఓవర్లకు 3 వికెట్ల నష్టానికి 113 పరుగులు సాధించింది. కౌశిక్ వారియర్స్ 6 వికెట్లకు 79 పరుగులతో ఓటమి చెందింది. నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



ఆటపాక డిగ్రీ కాలేజీలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, పోలీసులు

నూతన కార్యవర్గం ఎన్నిక



గుడివాడ టౌన్: కృష్ణాజిల్లా ట్యాక్స్ ప్రాఫిషినల్స్ అసోసియేషన్ గుడివాడ శాఖ నూతన కార్యవర్గ ఎంపిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఎం.వెంకటరమణకుమార్, కార్యదర్శిగా కేవీఎస్ఎస్‌హెచ్ ఫణికృష్ణ, కోశాధికారిగా తాడికొండ బాపణయ్య, ఉపాధ్యక్షులుగా జేవీవీ కుమార్‌బాబు, కె.గోవింద రాజులు, ఎల్.రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా జి.హేమంత్, ఆర్. పూర్ణ లక్ష్మీకుమార్, జి. బాలాజీ, కార్యవర్గ సభ్యులుగా కెసీహెచ్‌వి కిరణ్‌కుమార్, ఎల్.సాయి సీతారామ్ ఎంపికైనట్లు కార్యదర్శి ఫణికృష్ణ తెలిపారు. ఈ కార్యవర్గం జనవరి 31, 2026 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఎస్సీ కుటుంబాల జాబితా ప్రదర్శన

కైకలూరు: ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాలతో షెడ్యూల్ కులాల (ఎస్సీ) గణన సర్వే సోషల్ ఆడిట్ నిర్వహించామని ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర సోమవారం తెలిపారు. షెడ్యూల్ కులాల కుటుంబాల జాబితా సోషల్ ఆడిట్ నిమిత్తం ఆయా సచివాలయాల్లో ప్రదర్శించామన్నారు. జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు గుర్తించినా ఈ నెల 11వ తేదీ లోపు సచివాలయాల్లో తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అనంతరం కైకలూరు సచివాలయం–2లో రికార్డులు పరిశీలించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు



మోటూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తుడు



మణుగునూరు సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపాల్

గుడివాడరూరల్: గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మోటూరులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ అన్నారు. మండలంలోని మణుగునూరులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో మూడు అర్జీలు పలు సమస్యలపై అందజేశారు. ఆర్ఐ శ్రావణి, వీఆర్ఓ పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: రైతుల శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని ఈడేపల్లి, అల్లూరు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు సోమవారం నిర్వహించారు.

నందివాడలో..

నందివాడ: గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ఆఖరి సదస్సు సోమవారం జనార్దనపురం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 333 అప్లికేషన్ వచ్చాయని, వాటిలో 254 పరిష్కరించామని తెలిపారు. డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జోజిబాబు, మండల సర్వేయర్ అనూష, రోహీకమ్మ, ఆర్ఐ గణేష్ పాల్గొన్నారు.

22ఏ నిషేధిత భూముల తొలగింపునకు 390 అర్జీలు

కలిదిండి(కైకలూరు): నిషేధిత భూములను 22ఏ రిజిస్టర్ నుంచి తొలగించాలని 390 మంది హక్కుదారులు రెవెన్యూ అధికారులకు సోమవారం అర్జీలను సమర్పించారు. కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డు, పెదలంక సచివాలయం వద్ద హక్కుదారుల నుంచి అర్జీలను తీసుకున్నారు. రెండు శిబిరాల నుంచి 390 మంది రైతులు 22ఏ నుంచి భూములను తొలగించాలని అర్జీలను అందించారు. కలిదిండి తహసీల్దారు ఎల్‌వీఎస్ రామకృష్ణతో పాటు ప్రత్యేకాధికారులుగా దెందులూరు, ఏలూరు రూరల్ తహసీల్దార్లు బి.రమాదేవి, ఎ.శ్రీనివాసరావు, కూటమి నేతలు చిట్టూరి రవీంద్ర, రవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వెంటనే ఏర్పాటు చేయాలి

గుడివాడ టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని నెహ్రూచౌక్ సెంటర్లో వెంటనే ఏర్పాటు చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మాణంలో భాగంగా స్థానిక కోతిబొమ్మ సెంటర్లో గల అంబేడ్కర్ విగ్రహం తొలగిస్తున్న నేపథ్యంలో దానికి ప్రత్యామ్నాయంగా నెహ్రూచౌక్ సెంటర్‌లో కాంస్య విగ్రహ ఏర్పాటుకు గత ఏడాది పునాది వేసినట్లు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో కార్యక్రమం ముందుకు సాగలేదన్నారు. ఫ్లైఓవర్ పనులు వేగంగా జరుగుచున్నందున వెంటనే అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు పొంగులేటి జయరాజు, దారం కరుణాకర్, వాసుపల్లి రాంప్రసాదు, కోటి చిన్నా, చింతా నాని, సీహెచ్. జోషి, ఎన్.సురేష్, అశోక్, శేఖర్, టి. అనిల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

పుట్లమ్మ సత్రం సేవలు పునరుద్ధరణ

పామర్రు: బొమ్మారెడ్డి పెద్ద బుల్లియ్య అనే వెంకటరెడ్డి సత్రం (పుట్లమ్మ సత్రం)లో సేవలను పునరుద్ధరిస్తున్నట్లు పామర్రు గ్రూపు ఆలయాల మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సత్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో విధంగా ప్రస్తుతం కూడా సత్రాన్ని నామ మాత్రం రుసుంతో అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండు గదులు, ముందు ఖాళీ ప్రాంగణం గల ఈ సత్రంలో వివాహాది శుభ కార్యక్రమాలు చేసుకోవచ్చన్నారు. సన్మానాలు, చిన్న ఫంక్షన్లకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. మండల పరిధిలోని వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాసం పూజలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీ శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివార్లను దర్శించుకునేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కూసం ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ముదినేపల్లి రూరల్: డివిజన్‌లో సర్వీసు, ఫ్యామిలీ ఇతర పింఛన్లు పొందుతున్న వారు లైఫ్ సర్టిఫికెట్లను స్థానికంగా అందజేసేందుకు గుడివాడ సబ్‌ట్రెజరీ అధికారులు చర్యలు తీసుకున్నట్లు యూటీఎఫ్ నాయకుడు రమేష్ సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు పెన్షన్ పొందడానికి ఆధార్‌కార్డు జిరాక్స్, ఒరిజినల్ పింఛన్ బుక్, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సులు ఆధార్‌కు లింకు చేయబడిన ఫోన్ నంబర్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న, 22న అందజేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

డేటా అనాలసిస్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు

గుడివాడ టౌన్: డేటా అనాలసిస్‌పై పూర్తి అవగాహన అవసరమని వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు అన్నారు. కళాశాల ఆడిటోరియంలో డేటా అనాలసిస్ యూజింగ్ పైథాన్ అంశంపై వారం రోజుల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా సైన్స్ వినియోగంతో దేశం పారిశ్రామికంగా, ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. వైద్యరంగంలో డేటా సైన్స్‌ను ఉపయోగించడం వలన ప్రజల ఆరోగ్య పరిస్థితులు సైతం మెరుగు పడుతున్నాయన్నారు. నేటి తరంలో కృత్రిమ మేధమిషన్, లెర్నింగ్, రోబోటిక్స్ తదితర అంశాలను విద్యార్థులు నేర్చుకోవడం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, కంప్యూటర్ విభాగాధిపతి గంజి వెంకటరత్నం పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలకు యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ ఈడే దుర్గాభవాని సోమవారం సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. వీటిని పాఠశాలలో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు.



ఫ్యాన్‌ను అందజేస్తున్న యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్

కోడి పందేలకు దూరంగా ఉండాలి

మండవల్లి: పేకాట, కోడి పందేలు వంటి జూదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రామచంద్రరావు పేర్కొన్నారు. మండలంలోని పులపర్రులో గ్రామ కమిటీలతో కలిసి ఎస్ఐ అవగాహన సదస్సులు నిర్వహించారు. జూదాలకు బదులుగా క్రికెట్, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొనాలన్నారు.

ప్రకృతి సాగుపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వై.పి.సి.ప్రసాద్

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో సోమవారం లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి. ప్రసాద్ రాసిన పాలేకర్ ప్రకృతి వ్యవసాయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సాగుపై మెలకువలను వివరించారు. లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, రైతులు మన్నెం నరసింహారావు, పామర్తి కన్య భాస్కరరావు, వెనిగెండ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

నందివాడ: నందివాడ ఎస్ఐ కె.శ్రీనివాసు జనార్దనపురంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని తనిఖీలు చేయగా ఓ వ్యక్తి మద్యం తాగు పట్టుబడ్డారు. అతడి బైక్ సీజ్ చేసి ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

ధనుర్మాస పూజలు



జమీగొల్వేపల్లి(పామర్రు): మండలంలోని జమీగొల్వేపల్లిలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం పూజలను సోమవారం నిర్వహించారు. అనంతరం గోదాదేవి సహిత రంగనాథ స్వామికి శత సహస్ర నామాలతో ఆలయ అర్చకులు పూజ చేశారు. పామర్రు విష్ణాలయంతో పాటుగా మండలంలోని పలు ఆలయాల్లో ధనుర్మాస పూజలను చేశారు.